# చిరుదీపం



**ఆ** వూరి ప్రాథమిక పాఠశాల పిల్లల అల్లరితో గోలగోలగా వున్నది.

ఒకళ్ళనొకళ్ళు తిట్టుకోవడం, రక్కుకోవడం, చాటుమాటుగా కొట్టుకోవడం గందరగోళంగా వున్నది.

పంతుళ్ళు నలుగురూ ఒక చోట గుంపుగా చేరి రాజకీయాలు తీవ్రంగా చర్చిస్తున్నారు. పిల్లల గోల వాళ్ళ కబుర్లకు మరీ అంతరాయం అనిపించినప్పుడల్లా బెత్తంతో టేబుల్ మీద ఒక్క చరుపు చరిచి గావుకేక పెడ్తున్నారు పంతులవారిగా.

ఆ అదిలింపుకు ఒకటి రెండు నిమిషాలు మాత్రమే నిశ్శబ్దం. తిరిగి గుసగుసలతో మొదలై యథాస్థితికి చేరుతున్నది పిల్లల గోల.

ఆ గోలలో పాలుపంచుకోనివాడు ఒక్క సీను మాత్రమే. క్లాసు పుస్తకంలో వున్న లాల్ బహదూర్‌శాస్త్రి బొమ్మను తదేకంగా చూస్తున్నాడు. చూస్తున్న కొలది వాడిలో ఏదో ఉత్తేజం కలుగుతున్నది.

చదువుకునే రోజుల్లో పడవవాడికి ఇచ్చేందుకు డబ్బుల్లేక గంగానదిని ఈది బడికి వెళ్ళివచ్చిన ఆయన సాహసం వాడ్ని బాగా ఆకట్టుకున్నది. ఆ పాఠం చెప్పినప్పట్నుండి చదివి చదివి వాడికి కంఠతా వచ్చేసింది.

తమ వూరి పంటకాలువలో ఈతకొట్టాలనీ, బుడింగు బుడింగు మంటూ మిగతా పిల్లల్లా మునిగి తేలాలనీ, అవతలి గట్టునున్న సరుగుడు తోపుల్లో పరుగులు పెట్టాలనీ వాడికి ఎంతో సరదా.

ఆ సరదా తీర్చుకునే అవకాశం ఎన్నడూ వాడికి కలగనేలేదు. తమతో పాటు ఆటపాటల్లో వాడ్ని చేర్చుకునేందుకు ఎవరూ ఇష్టపడరు.

వేగంగా చలించే ఏ వస్తువన్నా వాడికి అమితమైన ఇష్టం. పరవళ్ళు తొక్కుతూ పరిగెత్తే పంటకాలువ నీటిని చూస్తుంటే మనస్సు ఆనందంతో కేరింతలు కొడ్తుంది.

బడిలో చేరకముందు పంటకాలవ గట్టుమీద కూర్చుని కాలాన్ని మర్చిపోయేవాడు. పిల్లలు నీళ్ళలో చేపపిల్లల్లా ఎగురుతుంటే చూస్తూ వుండబట్టలేక పోయేవాడు. ఒడ్డున కూర్చున్న సీను మీదకు నీళ్ళు చిమ్మేవాళ్ళు. నీటి అడుక్కి మునిగి గుప్పెళ్ళతో తడి ఇసుక పట్టితెచ్చి వాడి మీదకు విసిరి గేలిచేసేవాళ్ళు.

ఉక్రోషంతో సీను తిడ్తే రెచ్చిపోయి మరీ ఏడిపించేవాళ్ళు. ఒక్కోసారి ఒడ్డునుండి రాళ్ళు విసిరేవాడు. అవి తగలకుండా నీళ్ళల్లో మునిగి తప్పించుకునే వాళ్ళు. తనకు ఈత రానందుకే ఇట్లా లోకువ గట్టారన్న బాధ వాడ్ని కృంగదీసేది.

ఒకసారి వాళ్ళ గోల మితిమీరింది. నీళ్లు చిమ్ముతూ, ఇసుక జల్లుతూ ఎండిన పేడసుద్దలు మీదకు వేస్తూ ఏడిపించసాగారు.

"లంగడాయి! లంగడాయి! బడాయి లంగడాయి! దిగు.. దిగు... దిగరా.... దమ్ముంటే లంగడాయి" అంటూ పాటలు పాడసాగారు.

సీనుకు ఎన్నడూ రానంత పౌరుషం ముంచుకొచ్చింది. జుట్టుపట్టుకొని ఒక్కొక్కడ్నీ నీళ్ళలో ముంచి మళ్ళీ తన వూసెత్తకుండా తగిన శాస్తి చెయ్యాలనుకున్నాడు. ఆ కోపంలో వెనుక ముందు ఆలోచించలేదు.

నీళ్ళలోకి ఒక్క గెంతు గెంతాడు. ఈదటం చేతరాక మునుగుతూ తేలుతూ చేతులు తపతప కొడ్తూ నీళ్లు మింగసాగాడు.

పిల్లలు భయంతో గొల్లున అరిచారు. రేవులో పశువుల్ని కడుగుతున్న పాలేర్లు పరుగున వచ్చి సీనును ఒడ్డుకు లాక్కొచ్చి పడేశారు. తాగిన నీళ్ళను బయటకు కక్కించారు. గండం గడిచిందప్పటికి.

ఈ విషయం ఇంటిదగ్గర తెలవనే తెలిసింది. సీను తండ్రి వాడ్ని పలుపు తాడుతో వళ్ళు వాతలు తేలేలా కొట్టాడు. కాలువగట్టున మళ్ళీ కనపడ్డట్లు తెలిస్తే కాళ్ళు చేతులు కట్టి కాలువలోనే పారేస్తానన్నాడు.

అంతే! ఆ తర్వాత వాడ్ని కాలువ గట్టున చూశామని చెప్పినవాళ్ళే లేరు.

ఇంతదాకా తమ వూరి కాలువ ఈద గలిగినవాళ్ళే ఎంతో గొప్పవాళ్ళన్న అభిప్రాయం వుండేది. ఇప్పుడు ఆ అభిప్రాయం మారిపోయింది. గంగానదిని ఈదగలిగిన శాస్త్రిగారంతటి గొప్పవాళ్లు ఎవరూ లేరన్నది వాడి ఉద్దేశం.

ఈత గురించి ఎవరైనా తనముందు ప్రగల్భాలు పలికితే ఈ విషయం వాళ్ళకి చెప్పి గర్వం అణచాలనుకుంటున్నాడు.

సాటి పిల్లలకుండే వుబలాటాలన్నీ వాడికున్నాయి. కోతికొమ్మచ్చి ఆడాలని వుంటుంది. కాని వాడ్నెవరూ జట్టులో చేర్చుకోరు. చెట్ల కొమ్మలపైన వాళ్ళు చరచరా ప్రాకుతుంటే ప్రేక్షకుడిలా చూస్తుంటాడు. చిటారు కొమ్మల్లో దాక్కొని ఎగతాళి పట్టిస్తారు.

ఉక్రోషం కొద్దీ చెట్టు ఎక్కాలని ప్రయత్నించినా ఒక బారెడు కూడా ఎక్కలేకపోయేవాడు. ఒకసారి జారిపడి కాలు బెణికేసరికి ముఖం వాచేలా చివాట్లు తిన్నాడు.

సీను తమతోపాటు ఆడేందుకు పిల్లలంతా ఒప్పుకునేది ఒక్క గోళీలాట మాత్రమే. కాని గురి చూడటంలో నేర్పు లేక ఆడిన ప్రతిసారీ తనే దొంగయ్యేవాడు. ఒంటికాలితో కుందలేక కళ్ళనీళ్ళ పర్యంతమయ్యేవాడు. మధ్యలో పొరపాటున సీను

పంటయితే తొండిచేసి నాలుగు తన్ని పంపేవాళ్ళు. అయినప్పటికీ ఆ ఆటకు తిరిగి సిద్ధపడేవాడు.

ఉన్నట్లుండి ఒక్కసారిగా బడి చీమచిట్టుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం అయింది. కిట్ బ్యాగ్‌లతో ఇద్దరు వ్యక్తులు బడిలోకి రావటమే అందుకు కారణం. వచ్చినవాళ్ళెవరో పిల్లలు తెలిగ్గానే పసికట్ట గలిగారు.

"టీకాలవాళ్ళురా....టీకాలేస్తారు" అనుకుంటూ పిల్లలు గుసగుసలాడు తున్నారు.

పిల్లల ముఖాల్లో భయం ద్యోతకమవుతున్నది. కొందరిలో వణుకు మొదలైంది. నలుగురైదుగురు సన్నగా ఏడుపు మొదలెట్టారు. వాళ్ళను చూసి మరికొందరు ఏడ్చేందుకు సిద్ధపడుతున్నారు. కొందరైతే సందు చూసుకుని పారిపోయే ప్రయత్నంలో వున్నారు.

"మాష్టారూ!" అంటూ ఒకడు లేచి నిలబడి రెండేళ్ళు చూపించాడు.

"వెధవ! ఇప్పుడే వచ్చిందా నీకు? దొంగవేషాలేశావంటే చంపేస్తాను. కూర్చో" అంటూ వెర్రికేక పెట్టాడు పంతులు.

అదిరిపడి కూర్చున్నాడు వాడు. వాకిలి దగ్గర కూర్చున్న ఇద్దరు పిల్లలయితే ఒక్క గెంతులో బయటకు దూకారు.

"రేయ్! ఆ వెధవల్ని లాక్కురండి" పంతులుగారి ఆదేశాన్నందుకున్నంతనే ఐదవతరగతి పిల్లలు నలుగురు వాళ్ళ వెంటబడ్డారు.

ఈ గోల ఇంకా సీను చెవిలో దూరనేలేదు. వాడిలోకంలో వాడున్నాడు. పారిపోయిన పిల్లల్ని పట్టి ఈడ్చుకొచ్చారు.

"మాష్టారూ! మాకు టీకాలొద్దు. ఇంటికెల్తాం" అంటూ ఆ ఇద్దరూ శోకాలు మొదలెట్టారు.

వాళ్ళిద్దర్నీ చూసి బెంబేలుపడిన పిల్లలు కొందరు పెద్దగా ఏడుపు మొదలెట్టారు. పంతుళ్ళకి చిర్రెత్తుకొచ్చింది. బెత్తంతో పారిపోయిన ఇద్దరికీ చెరిరెండు వడ్డించారు.

"నోర్ముయ్యండి వెధవల్లారా! పైకి విన్పించిందంటే వళ్ళు పగలగొడ్తాను" అంటూ అరిసేసరికి ఆ ఇద్దరూ అరచేతులతో నోళ్లు మూసుకున్నారు.

అయితే ఇంకా గోల పూర్తిగా సద్దుమణగలేదు. బెత్తంతో బల్లమీద చరుస్తూ 'సైలెన్స్' అని అరిచాడు. వాళ్ళని సముదాయించటం ఎలాగన్న ఆలోచనతో ఆయన బుర్ర వేడెక్కింది. అప్పుడే ఒక ఆలోచన ఆయన బుర్రలో తటాలున మెరిసింది.

"రేయ్ సీనూ ... నిన్నేరా కుంటోడా!" అంటూ ఒక్క వెర్రికేక పెట్టాడు.

సీను తుళ్ళిపడ్డాడు. అదిరిపాటుగా లేచి నిలబడబోయి తూలిపడ్డాడు. కొందరు గొల్లున నవ్వేరు.

"సరిగా లేచి చావరా గాడిదా!" గద్దించాడు పంతులు.

సీను అయోమయంగా లేచాడు. మోకాళ్ళ క్రిందకు జారిపోతున్న నిక్కరును కుడిచేత్తో పైకి లాక్కుంటూ ఊతంగా ఎడంచేతిని గోడకు ఆనించి ఒంటికాలు మీద నిలుచున్నాడు.

"రేయ్! వాడ్ని చూడండ్రా గాడిదల్లారా! పోలియోడ్రాప్స్ వేయించకపోవడం వలన వాడి బ్రతుకిలా అవిటిదయింది. పోలియో జబ్బొచ్చి కాలుపడిపోయి కుంటాడయ్యాడు. క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం మొదలైన ప్రమాదకరమైన జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తారు. బుద్ధిగా టీకాలు వేయించుకుంటే ఇలాంటి జబ్బులేవీ మీకు రావు. తెలిసిందా?" అంటూ వివరించాడాయన.

పిల్లల దృష్టంతా సీను మీద నిలిచింది. అందరూ వాడ్ని కుంటోడని, లంగడాయని, సోట్టోడని ఎగతాళి పట్టించిన వాళ్ళేగాని వాడి దురదృష్టానికి కారణం ఏమిటనేది వాళ్ళకే గాదు సీనుకు కూడా తెలీదు.

"భయంలేదు. నోట్లో తియ్యని మందు చుక్కలు వేస్తారు. టీకాలంటే చీమ కుట్టినంత నొప్పంతే. మధ్యాహ్నం బడికి శెలవు ఇస్తాం. మందు వేయించుకోకుంటే మీరు, అదుగో - వాడిలా అవుతారు" అంటూ హెడ్మాస్టరు కూడా భయపెట్టాడు.

ఆ మాటలు పిల్లలమీద బాగానే పని చేసినట్లున్నాయి. అందరికీ భయం పోయింది. గోల తగ్గింది.

తలొంచుకుని నిలబడ్డ సీను మనస్సులో సంచలనం చెలరేగింది. ఊహ తెలిసినప్పట్నుండి కుంటికాలితోనే నేలమీద దేకటం వాడికి తెలుసు. నాలుగేళ్ళు వచ్చేదాకా ఇంట్లోనే దేకుతూ నాలుగ్గోడల మధ్య మగ్గాడు. వీధి అరుగు మీద కూర్చుని లేడిపిల్లల్లా గెంతుతున్న పిల్లల్ని దీనంగా చూస్తూ గంటల తరబడి గడిపేవాడు.

అందరిలోనూ తన అవిటితనాన్ని వేలెత్తి చూపటం వాడ్ని కష్టపెట్టింది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఎన్నో సందేహాలు తన అవిటితనం గురించి వాడి మనస్సులో తలెత్తాయి.

"కూర్చోరా సీను!" అన్న పంతులు మాటకు మెల్లగా చేరగిలబడ్డాడు. ఎవరూ గమనించకుండా కన్నీళ్ళు చొక్కాతో అద్దుకున్నాడు.

పంతులుమీద వాడికి కోపం వచ్చింది. ఆయనిలా ప్రవర్తించటం ఇదే మొదటిసారి కాదు. గాంధీ జయంతి నాడు బడి పిల్లలకు ఆటల పోటీలు పెట్టారు.

పోటీల్లో హుషారుగా పాల్గొంటూ బహుమతులు గెల్చుకుంటున్న పిల్లల్ని చూస్తూ సీను మనస్సు వుండబట్ట లేకపోయింది. తనూ పోటీ చేయాలనీ, బహుమతి గెల్చుకోవాలనీ పట్టుదల కలిగింది.

పరుగుపందెంకోసం పిల్లలు వరుసగా నిలబడుతుంటే తనూ వాళ్ళ సరసన నిలుచున్నాడు. చూసిన వాళ్ళంతా ఫకాల్న ఒకటే నవ్వటం.

"సీనాయ్! పరుగుపందెంలో నువ్వూ పాల్గొంటావా?" అంటూ పంతులు బిగ్గరగా నవ్వేడు.

"ఆఁ.... నేనెందుకు పరిగెత్తలేను!" అన్నాడు పౌరుషంగా.

"ఏడ్చేవ్‌లే! పడ్డావంటే ఆ రెండో కాలు కూడా విరుగుతుంది. రా బయటకు" అరిచాడాయన.

"ఊఁహూ. నేనూ పోటీ చేస్తాను" అన్నాడు సీను రోషంగా.

"వెధవని నీక్కాదూ చెప్తుంది. ఒంటికాలి గుఱ్ఱంలాగా నువ్వూ నీ పరుగూను...రా, బయటకు" అంటూనే సీనును ఇవతలకు ఒక్కగుంజు గుంజాడు.

పిల్లలంతా 'సొట్టాయ్' అంటూ చప్పట్లు, కేరింతలతో గోలగోలగా అరిచేరు. ఏడుపు ముంచుకొచ్చింది. తన అవిటితనం మీద అందరూ కలిసి కత్తిగట్టినట్లుగా తల్లడిల్లిపోయాడు.

పొందిన అవమానం వాడ్ని అక్కడ క్షణం నిలువ నివ్వలేదు.

ఇంటికి వెళ్ళాలనిపించలేదు. కాళ్ళీడ్చుకుంటూ చింత తోపులోకి వచ్చాడు. ఓ చెట్టు క్రింద కూలబడ్డాడు. వాడి మనస్సు అవమానంతో కుతకుత వుడికిపోతున్నది. ఎవరిమీదనో తెలీని కసితో రగిలి పోతున్నది.

చెట్లమీదుగా రివ్వున ఎగురుతున్న పక్షుల్ని చూశాడు. టపటపలాడుతున్న వాటి రెక్కల కదలికల్ని గమనించాడు.

ఉత్తేజం కలిగింది. ఉక్రోషం ముంచుకొచ్చింది. పౌరుషం పొంగి పొర్లింది. తనకూ కాళ్ళున్నాయి! తనూ పరిగెత్తగలడు! పక్షులతోనైనా పోటీపడగలడు.

వేయి ఏనుగుల బలం వచ్చిన వాడిలా లేచాడు సీను. చింతతోపులో పక్షుల వెంటబడి ఒకటే పరుగు పెట్టడం. రోజుతూ రొప్పుతూ, చెట్లుల్ని పుట్టల్ని తప్పుకుంటూ తన్నుకుంటూ పరిగెత్తి పరిగెత్తి బోర్లపడిపోయాడు.

బట్టల నిండా మురికి. మోకాళ్ళు, మోచేతులు దోక్కుపోయాయి. అయినా వాడికి బాధనిపించటం లేదు.

కసి చల్లారింది. మనస్సు శాంతించింది. నేలమీద పడ్డవాడు వగరుస్తూ ఎంతో సేపు అలానే పడుకున్నాడు.

టీకాలు, డ్రాప్స్ అందరికీ వేశారు. బడికి శెలవిచ్చారు. సీను ఇంటికి బయల్దేరాడు.

తను కుంటివాడు ఎందుకయ్యాడు? అమ్మా, నాన్న తనకు మందు వేయించలేదా? వేయిస్తే అందరిలా తనకూ కాళ్ళు బాగుండేవి. అప్పుడు ఎంచక్కా ఆటలన్నీ ఆడొచ్చు గదూ.

సీను రోజులా ఇంటికి వెళుతూనే తన చిన్నారి తమ్ముడి ముఖాన్ని ముద్దులతో ముంచెత్త లేదు. వాడి కేరింతలతో పాటు తనూ కేరింతలు కొట్టలేదు. బడి ముచ్చట్లన్నీ మూటగట్టుకొచ్చి తమ్ముడికి చెప్పలేదు.

పచ్చగా, బొద్దుగా వుండే తమ్ముడంటే సీనుకు అమితమైన ఇష్టం. చిన్నారి చేతులతో వాడు తన ముఖాన్ని తడుముతుంటే ఎక్కడలేని ఆనందం సీనుకు. తమ్ముడి పొట్టమీద నోరుంచి బర్రుమనిగాలి వూదుతుంటే కితకితలతో వాడు కేరింతలు కొడ్తుంటే సంతోషం పట్టలేకపోయేవాడు.

తమ్ముడ్ని భుజానేసుకుని తిరగాలని వాడికెంతో సరదా. కాని తల్లి అందుకు ఇష్టపడేది కాదు.

"వాడ్ని పడేస్తావురా! దెబ్బ తగులుతుంది" అంటూ ఎత్తుకోనిచ్చేది కాదు.

తల్లి అలా అన్నప్పుడల్లా వాడికి బాధ కలిగేది. తల్లి కూడా అందరిలానే తనను చిన్నచూపు చూస్తున్నదని వేదనకు గురయ్యేవాడు.

'తమ్ముడూ! నిన్ను ఎత్తుకు తిప్పటంలేదని నామీద కోపం తెచ్చుకోమాకు. మరి నాది కుంటికాలు గదా! నీవు నడుస్తావు చూడు. అప్పుడు వూరంతా మనిద్దరం

తిరిగొద్దాం. సరేనా?' అంటూ తమ్ముడితో గుసగుసలాడుతున్నట్లుగా చెప్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకునేవాడు.

"ఏరా సీను! పడుకున్నావేం, బడికి వెళ్ళవా?" అడిగింది రాజమ్మ, కుక్కిమంచంలో మోకాళ్ళ మధ్య తల ఇరికించుకొని పడుకునున్న సీనుని.

"బడిలేదు. శెలవిచ్చార్లే!" అన్నాడు ముక్తసరిగా.

ఎందుకని ఆమె అడగనూలేదు, వీడు చెప్పనూ లేదు. కాని కాసేపటికి సీను ధోరణి ఆమెకు అనుమానం కలిగించినట్లుంది. చేతులు తప తపకొడ్తూ, ఎవరో తనను పలకరించినట్లే వూసులు చెప్తున్న తమ్ముడ్ని పట్టించుకోకుండా సీను అలా పడుండటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

"వంట్లో బాగలేదట్రా!" అంటూ వాడి నుదుటిమీద చేయివేసి చూసింది. నుదురు చల్లగానే వున్నది.

"అన్నం తినవా?" అడిగింది.

అడ్డంగా తలూపాడు. ఎవరో వాడి మనస్సు కష్టపెట్టి వుంటారని, అందుకే వాడలా వున్నాడనీ బిడ్డ మనస్సు ఎరిగున్న తల్లి గనుక గ్రహించింది. తానే ఆరాలడిగితే వాడు మరీ తల్లిడిల్లిపోతాడని మిన్నకుండి తన పనిలో నిమగ్నమైంది.

ఇతరులకు ఏ మాత్రం నష్టం కలిగించని సీను అవిటితనం పట్ల వాళ్ళకంత చిన్నచూపు ఎందుకో ఆమెకు అర్థంకాదు. ఎవరన్నా వాడ్ని ఆటలు పట్టించారని తెలిసినప్పుడల్లా ఆ తల్లి హృదయం విలవిలలాడుతుంది.

"అమ్మా! నా కాలు ఎందుకిలా అయింది?" అడిగాడు సీను వున్నట్లుండి.

ఆమె వాడి ప్రశ్నకు కలవరపడింది. ఇటువంటి ప్రశ్న సీను ఎన్నడూ అడగలేదు.

"ఏం లేదురా! దేవుడికి కొందరంటే చులకన. ఇట్లా చేస్తా వుంటాడు" అన్నది, అంతకన్నా ఏం చెప్పాలో స్ఫురించక.

"హుఁ! అంతా వుత్తిది" అంటున్నప్పుడు వాడి స్వరంలో నిరసన ధ్వనించింది. సీను మాటలు రాజమ్మ మనస్సులో గుచ్చుకున్నాయి.

"ఏమిట్రా నువ్వనేది?" అన్నది.

"మందు వేయించుకుంటే ఇలా కాదంటగా?"

"అట్లాగని ఎవరు చెప్పారు?" అన్నది తొట్రుపాటుతో.

"పంతులుగారు చెప్పారు. టీకాల మందు వేయించుకోకపోతే నాలా కుంటోళ్ళవుతారని అందర్నీ తిట్టాడు" వాడి కళ్ళల్లో నీరు నిలిచింది.

రాజమ్మకు గొంతు పెగల్లేదు. ఇలా వాడు నిందిస్తాడని ఆమె ఎన్నడూ అనుకోలేదు. ఆ నిష్ఠూరానికి తగిన సమాధానం ఆమె దగ్గర లేదు.

"నా కెందుకు మందు వేయించలేదమ్మా? మందు వేయిస్తే నా కాలు ఇట్లా అయ్యేది కాదు, కాదమ్మా"? అంటున్న సీను ముఖంలోకి చూడలేకపోయింది రాజమ్మ.

సాక్ష్యంతో సహా పట్టుబడ్డ దోషిలా ఆమె అచేతనురాలయింది. కెవ్వుమన్న చంటివాడు ఆమెను అప్పటికి రక్షించినట్లయింది. వాడ్ని చంకనేసుకుని సముదాయిస్తూ వంటింట్లోకి దారితీసింది.

చేసిన తప్పు కొడుకుముందు ఒప్పుకోలేక ఆమె ముఖం చాటుచేసుకున్నది. కాని అంతరాత్మ రాజమ్మను నిలదీసింది. నిజం ఆమె గుండెను నిప్పులా దహించసాగింది. చంటివాడ్ని ఒడిలో ఉయ్యాలూపుతూ నిద్రపుచ్చసాగింది.

సీను నెలలబిడ్డగా వున్నప్పుడు పోలియోడ్రాప్స్ వేస్తామంటూ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు వచ్చారు. పిల్లలకు ప్రమాదకరమైన జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చదువుసంధ్యలు లేని రాజమ్మకు వాళ్ళు చెప్పే జబ్బులు, వాటి విపరీత పరిణామాలు గ్రహించగలిగే పాటి జ్ఞానం లేదు.

"ఆ పోనిద్దూ! మందువేసి వాళ్ళ దోవన వాళ్ళు పోతారు. జొరంవస్తే పిల్లాడు అల్లాడిపోతాడు. మనందరం ఏ మందులు, సూదులు ఏయించుకుని ఇంతకాలం బతికి బట్టకట్టేం. ఆల్ల జీతంరాళ్ళ కోసరం ఆల్ల తిప్పలు తప్పితే ఏముందిదంతా" అంటూ అప్పట్లో బ్రతికున్న రాజమ్మ అత్త కూడా ఖాతరు చేయలేదు.

అర్థంలేని అత్తగారి తర్కం ఆమెను తప్పుదారి పట్టించింది. తమ ఇంటావంటా లేని అలాంటి జబ్బులు గురించి తమకెందుకు భయం అనుకున్నది. రాజమ్మ పిల్లవాడికి వంట్లో నలతగా వుందన్న సాకు చెప్పి బిడ్డను వాళ్ళ కంట పడనివ్వకుండానే సాగనంపింది.

సీనుకి రెండో ఏడు వస్తూనే, తప్పటడుగులతో చేతికందిన వాటినల్లా చిందర వందరచేస్తూ, చిలిపి చేష్టలతో ఇంటిల్లపాదికి కనువిందు చేస్తున్న రోజుల్లోనే జ్వరం ముంచుకొచ్చింది. ఊళ్ళోవున్న ఆచారిగారి వైద్యం ఏమీ ఫలించలేదు. హఠాత్తుగా కాలు పడిపోయింది. ఆచార్లు పట్నం తీసుకెళ్ళమన్నాడు.

పోలియో అని తేల్చాడు పట్నం డాక్టర్. డబ్బు మంచినీళ్ళలా ఖర్చయింది. కాలిలో చెప్పుకోదగ్గ మార్పురాలేదు. బ్రతికి బట్టకట్టాడు. బిడ్డ అవిటివాడవుతాడన్న భయంతో పెద్ద పెద్ద డాక్టర్ల చుట్టూ తిప్పారు. అప్పుల పాలైనా పూర్తిగా కాలు స్వాధీనంలోకి రాలేదు. ఇంతకన్నా చేయగలిగింది లేదన్నారు డాక్టర్లు.

తమ తెలివి తక్కువతనం బిడ్డకు అవిటితనాన్ని మిగిల్చింది. వాడి అవిటితనం వాడ్ని అందరికీ లోకువ చేసింది. తాము చేసిన పొరపాటుకు శిక్ష అనుభవిస్తున్నది అమాయకుడైన బిడ్డ.

చేసిన తప్పుకు ఏమని సంజాయిషీ ఇవ్వగలదు? తమ అజ్ఞానంతోనే బిడ్డ బ్రతుకు అవిటిదయిందని నోరు విప్పి ఎలా చెప్పగలదు?

కన్నబిడ్డ దైన్యస్థితిని తలచి తలచి ఆమె ఒంటరిగా కుమిలి పోసాగింది.

◆ ◆ ◆

రాజమ్మ పని చేసుకుంటున్నది. ఎవరో తరుముకొచ్చినట్లుగా సీను తల్లి దగ్గరకు వచ్చిపడ్డాడు.

"అమ్మా....అ.......మ్మా" అలసటతో వాడి ఛాతి ఎగిరెగిరి పడుతున్నది.

"ఏమిట్రా?" అన్నది వాడి ధోరణికి కాస్త కలవరపడుతూ.

"వాళ్లొచ్చారు?.... రామ్మా బయటకు" అంటూ కొంగుపట్టి గుంజసాగేడు.

"ఎవర్రా వాళ్ళు?" అంటూనే రాజమ్మ వాకిట్లోకి నడిచింది.

మెడికల్ కిట్‌తో ఇద్దరు వ్యక్తులు బయట నిలబడున్నారు. వాళ్ళెవరో వాలకం బట్టి ఆమె గ్రహించ గలిగింది.

ఆ ఇద్దర్లో ఒకతను సీనుకేసి చూస్తూ, "బాబు మీ అబ్బాయల్లే వుంది. మేం వూళ్ళో కొచ్చినప్పట్నుండి మా వెంట బడి తిరుగుతూ ఇంటికి రమ్మని ఒకటే తొందర చేయటం..." అన్నాడు.

దేనికోసమన్నట్లుగా సీను కేసి చూసింది రాజమ్మ.

"అమ్మా! మొన్న స్కూల్లో టీకామందు లేసేరే, వాళ్ళే! తమ్ముడి కోసమని తీసుకొచ్చా" అన్నాడు సీను.

"ఏమ్మా! మీ ఇంట్లో పసిపిల్ల వాడున్నాడా?" అడిగాడు రెండో అతను.

ఉన్నాడన్నట్లుగా తలూపింది రాజమ్మ.

"పిల్లలకు పోలియో రాకుండా డ్రాప్స్, కోరింతదగ్గు, ధనుర్వాతం రాకుండా డి.పి.టి. ఇంజక్షన్లు చేస్తున్నాం. మీ చిన్నబ్బాయికి వేయించకపోతే వేయించటం మంచిది" అన్నాడు.

"వెళ్ళమ్మా! తమ్ముడ్ని తీసుకురా..." రాజమ్మ చేతిని కదిలిస్తూ తొందరపెట్టాడు సీను. రాజమ్మ తలూపి లోపలకు నడిచింది.

ఆరోజుల్లో తమ కెవరికీ లేని జ్ఞానం ఈనాడు వాడికున్నది. సీను మనస్సు గ్రహించిన ఆమెకు దుఃఖం ఆగలేదు. పొత్తిళ్ళలో వున్న చంటివాడి దగ్గర కూర్చుని వెక్కిళ్ళు పెడుతున్న రాజమ్మ లోనికి వస్తున్న సీను అడుగుల చప్పుడుకు దుఃఖం దిగమింగేసింది. వాడ్ని ప్రేమగా దగ్గరకు తీసుకుని శరీరానికి హత్తుకున్నది.

కన్నీటిపొంగును పమిట కొంగుతో గబగబా అద్దుకుని చంటివాడ్ని చేతుల్లోకి తీసుకుని బయటకు నడిచింది రాజమ్మ.

ఇప్పుడు సీను కళ్ళల్లో కోటి చందమామలు వెలుగుతున్నాయి.

❊

*(యువ మాసపత్రిక, జులై 1986)*